# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 04 ఆగష్టు 2025


## ఎండుతున్న ఖరీఫ్ వేరుశనగ.

**తంబళ్లపల్లె ఆగస్టు 3 ప్రభాతవార్త ః**



మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేసిన వేరుశనగ పంట వర్షం లేక నిట్ట నిలువునా ఎండిపోతోంది. ఈ ఖరీఫ్ సీజన్లో మండలంలోని బాలిరెడ్డిగారిపల్లి, కోసువారిపల్లె, ఎద్దుల వారి పల్లె, ఎర్రసానిపల్లె, కన్నె మడుగు, గోపిదిన్నె, మర్రి మాకులపల్లి, రేణు మాకుల పల్లె, కోటకొండ, జుంజురపెంట, దిగువపాలెం, గుండ్లపల్లి, తంబళ్లపల్లె, పంచాలమర్రి, కుక్క రాజు పల్లి, రెడ్డి కోట, దిగువ పాలెం, కొటాల, ఆర్ఎ న్ తాండ, గంగిరెడ్డిపల్లి పంచాయతీలలో అక్కడక్కడ రైతులు వేరుశనగ పంట గంపడాశతో విత్తారు. వర్షాన్ని నమ్ముకుని ఎకరాకు రూ10వేల నుండి రూ12 వేల వరకు ఖర్చు చేసి వేరుశనగ పంట విత్తిన మొదలు వర్షమే రాకపోవడంతో వేరుసెనగ మొక్కలు ఎండకు నిలువునా ఎండిపోతున్నాయి. వేరుశనగ పంట చేతికి వచ్చే సూచనలు లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. జీవనోపాధి కోసం విధి లేని పరిస్థితుల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లక తప్పడం లేదు. మరికొందరు రైతులు ఆర్థిక స్థోమత లేక ఖరీఫ్ సాగు పై ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం వెంటనే రైతులకు పంట నష్ట పరిహారం, పశువులకు పశుగ్రాసం, పూర్తి సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంట విత్తనాలు పంపిణీ తో పాటు విరివిగా ఉపాధి హామీ లో పని దినాలు పెంచి పనులు కల్పించకపోతే వలస బాట పట్టడం ఖాయం.

## అలరించిన నృత్యాలు..

**కడప కార్పొరేషన్ ఆగస్టు 3 ప్రభాతవార్త:**



ఆదివారం కడప శిల్పారామంలో సాంస్కృతిక కళ వేదిక మీద అఖిల్ సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ బృందం పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, నాటు నాటు, రాను బొంబాయికి రాను బొంబాయిరాను, మాస్ రాజ వంటి పాటలకు డ్యాన్సులు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలన అధికారి ఎస్ కృష్ణ ప్రసాద్ మరియు ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన బాబు పర్యవేక్షించారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం





**గాలివీడు, ఆగస్టు 3(ప్రభాతవార్త):**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర యువజన, రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సోదరుడు మడిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మండలంలోని వెలిగల్లు జలాశయం కుడ కాలువ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతుల సౌకర్యార్థం కుడికాలువ ద్వారా నీటిని 0.5 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వెలిగల్లు జలాశయంలో ప్రస్తుతం 2.681 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందులో లైవ్ స్టోరేజ్ 1.47 టీఎంసీలు కాగా, తాగునీటి కోసం గాను 0.40 టీఎంసీలు కేటాయించినట్లు తెలిపారు. కుడికాలువ ద్వారా ప్రతీ రోజూ సగటున 60 క్యూసెక్కుల చొప్పున 3 మాసాలకు గాను 0.681 టీఎంసీలు నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ నీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుని పంటలు సాగు చేసోవాలన్నారు. రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుందని రైతుల కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఎస్ఈ అబ్బులసమి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈలు భాస్కర్‌బాబు, శిరీష కుమార్, సురేష్‌బాబు, రమణయ్య, ఏఈ సాంబ, వర్ 2 ఇన్‌స్పెక్టర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

### రూ.4 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని బాధితునికి అందించిన మంత్రి:

గొట్టివీడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ నాయుడు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తరుణంలో స్పందించిన మంత్రి చికిత్స కోసం రూ.4 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని బాధితుడికి అందజేశారు.

### టీడీపీ నాయకులు చిన్నగంగిరెడ్డి భౌతికకాయానికి నివాళులు:

గోరాన్‌చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లె తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కరిమిరెడ్డి చిన్న గంగిరెడ్డి మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీకి వారు అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రఘాడ సానుభూతిని తెలియజేశారు.

## పొగాకు అమ్మకాలపై పట్టించుకోని అధికారులు

**రామసముద్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు అమ్మరాదంటూ, ఆరోగ్యాన్ని దెబ్బతీసే వీటిపై ప్రభుత్వం నిషేదం విధించింది. కానీ రోడ్ల పక్కన టి దుకాణాల్లో, పాన్‌షాపుల్లో, డాబాల్లో, చిల్లర దుకాణాల్లో, ఆయిల్ స్టోర్స్‌ల్లో ప్యాకెట్లను బహిరంగానే అమ్ముతున్నారు. కొనుగోలుదారులు కొంటున్నారు. తినేవారు తింటున్నారు. ఇలా నిషేదాన్ని వెక్కిరింతగా మార్చేశారు. పైగా దానిపేరు చెప్పి ఒక్కో ప్యాకెట్‌పై రెండు నుండి నాలుగు రెట్లు అధిక ధరలు పెంచేశారు. వ్యాపారులు, అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలని వ్యాపారాలు అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణంలోని మూరుమూల వాడల్లో గుట్టుచప్పుడు కాకుండా గుట్కా నిల్వ ఉంచి అమ్ముకొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటికి కోడ్ బాషను ఉపయోగించుకొని దుకాణాల్లో కొంటున్నారు. జి అంటే గుట్కా, సి అంటే ఖైనీ, పి అంటే పాన్‌పరాగ్, ఎల్ అంట్ పెద్ద ఖైనీ పొగాకు ఇలా ఒకొక్క దానికి ఒకొక్క పేరు పెట్టి తీసుకొంటున్నారు. అప్పారావువీధి, త్యాగరాజవీధి, అప్పారావుతోటలో మరీ విపరీతంగా చిల్లర దుకాణాల్లో అమ్ముతున్నారు. మండలంలోనిమారుమూలగా ఉన్న ప్రాంతాల్లో అధికంగా అమ్ముతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్కా ఆనవాలు లేకుండా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. గుట్కా వ్యవహారాలు సాగినా, సరఫరా చేసినా గుట్కాతయారీ కేంద్రాలను తయారవుతున్నట్లు బయటపడితే ఆయా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓలను బాధ్యులుగా చేస్తామని ఉన్నతాధికారులు చెబుతు ప్రకటనలు ఇస్తున్నారు. అయితే టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటి పోలీసులకు భారీ సంఖ్యలో గుట్కా విక్రయాలు పట్టుబడ్డా ఆయా పోలీస్‌స్టేషన్‌లో అంతంతమాత్రమే కేసులు పెడుతున్నారు. బాధితులు అంతంతమాత్రమే కేసులతో చట్టాలకు చుట్టాలై తప్పించుకొని మళ్ళీ యదావిధిగా అదే వ్యాపారంలో రెట్టింపు సంపాదిస్తున్నారు. గుట్కాలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి శివార్లలోని గౌడౌన్లలో నిల్వ చేస్తున్నారు. గౌడౌన్లలో స్టోర్ చేసిన గుట్కాలను చిన్న చిన్న ఆటోల్లో తరలిస్తున్నారు. ఒకవేళ పోలీసులకు చిక్కితే గౌడౌన్ సమాచారం తెలియనీయకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఆటోల్లో, కార్లల్లో, టూవీలర్స్‌లో కవర్లు, సంచుల్లో గుట్కాలను పెట్టుకొని తమ కష్టమర్లకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి వ్యాపారులకు చిన్న, పెద్దా అన్న తేడా లేకుండా షోల్డర్ బ్యాగుల్లో వేసుకొని కావాల్సిన దుకాణాలకు రవాణా రూపంలో చేర్చుతున్నారు. పట్టణంలోని ఆయా పాన్‌షాపులకు, కిరాణ దుకాణాలకు నేరుగా సరఫరా అవుతొంది. ప్రజా ఆరోగ్యానికి హానికరంగా మారిన నిషేదిత గుట్కా, ఖైనీ విక్రయాలపై ఉక్కుపాదం మెపాలని ప్రజలు కోరుతున్నారు.

## అదృష్యమైన మహిళా మృతి

**దువ్వూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆకుల నాగజ్యోతి(27) అనే మహిళ శుక్రవారం అదృష్యం కాగా ఆదివారం కేసీ కాలువలో ఆమె మృతదేహం లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగజ్యోతి గత కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడం, ఆరోగ్య సమస్యలు ఉండటంతో మనస్ఫర్థం చెందుతూ ఉండేది. ఇటీవల వారి బంధువులు మరణించడంతో ఆమె మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి 12గంటలకు ఇంటి నుండి వెళ్లిపోయినట్లు భర్త ఆకుల హరి శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు దువ్వూరు పోలీసులు అదృష్యం అయిన మహిళగా గుర్తించి కేసు నమోదు చేశారు. దీనిపైన విచారణ జరపగా ఆదివారం ఆమె మృతదేహం కేసీ కెనాల్‌లో భీమునిపాడు సమీపంలో ఉన్న తూము వద్ద లభ్యమైంది. ఈ మేరకు నాగజ్యోతి మతిస్థిమితం లేక మనస్థాపం చెంది మృతి చెందినట్లు భర్త ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భూషణం తెలిపారు.

## ద్విచక్ర వాహనమును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### ఒకే కుటుంబం చెందిన ముగ్గురు యువకులు మృతి

**మదనపల్లి క్రైమ్ ఆగస్టు 3 ప్రభాతవార్త.**

అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రిఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మొలకలచెరువు ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వేపూరికోట పంచాయితీ కూటగులోల్లపల్లికి చెందిన వెంకటేష్ (20), తరుణ్ (24), మనోజ్ (19) లు వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మొలకల చెరువుకు వెళ్లారు. అనంతరం తిరిగి స్వగ్రామం కు వెళ్తుండగా పెద్దపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబం కు చెందిన అన్నదమ్ములు ముగ్గురు అక్కడి కక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరసింహుడు చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అక్షయపాత్ర ద్వారా విద్యార్థులతో నాణ్యమైన ఆహారం అందిస్తాం

**వేంపల్లె :ఆగష్టు 03 (ప్రభాత వార్త**



రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అందరికీ అక్షయపాత్ర సంస్థ ద్వారా త్వరలో నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని రెండు మెస్ ల్లో పురుగుల భోజనం పెట్టుతున్నారని శనివారం రాత్రి విద్యార్థులు నిరసన చేయడం జరిగింది. ఈనేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆదివారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అలాగే ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ తో పాటు ఆయా శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి విద్యార్థులకు భోజనం అందించే మెస్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెస్ ల తనిఖీల్లో అవినీతితో పాటు అపరిశుభ్రంగా ఉండడంతో మెస్ నిర్వాహకులపై, అధికారులపై ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. మెస్ ల వద్దనే సిబ్బంది యూరిన్ చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అధికారులు కూడ అప్పడప్పుడు పరిశీలన చేస్తూ ఉండాలని సూచించారు. మెస్ ల వద్ద ఉన్న చేతులు కడుక్కొనే ప్రాంతం కూడ అపరిశుభ్రంగా ఉండడంపై విద్యార్థులు ఎమ్మెల్సీకి పిర్యాదు చేశారు. అపరిశుభ్రంగా ఉండడం వలన చేతుల కడుక్కొనేందుకు వెళ్లితే తిన్నది కూడ బయటికి వస్తున్నదని ఎమ్మెల్సీకి విద్యార్థులు చెప్పడంతో అ ప్రాంతంలో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులను విద్యా బోధన, సౌకర్యాలపై ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు భోజనంలో పురుగులు వస్తున్నాయని నిరసన చేపట్టడం వలన పత్రికల్లో, ప్రసార సాధనాల్లో వార్తలు రావడం వలన విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీని ఆకస్మిక తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. మెస్ మెయింటినెన్స్ సక్రమంగా లేదన్నారు. రేషన్ బియ్యం తెచ్చి పాలిష్ కొట్టించి వాడుతున్నారని చెప్పారు. విద్యార్థులు అందించే ఆహారంకు సంబంధించి రెండు రకాల బియ్యాన్ని వాడుతున్నారని బియ్యంలో కల్తీను గుర్తించినట్లు చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే పాలలో నీళ్లు ఎక్కువగా కలిపి ఇవ్వడం బాధకరమని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా అన్నం పడుతున్నట్లు మెస్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. మెస్ నిర్వహకులు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. మెస్ సమీపంలోనే మెస్ సిబ్బంది మలమూత్రాలు విసర్జించడంతో విద్యార్థులు అనారోగ్య పాలై అవకాశం ఉన్నట్లు చెప్పారు. అక్షయ పాత్ర సంస్థ ద్వారా ట్రిపుల్ ఐటీలలో నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి విద్యాశాఖ కృషి చేస్తున్నట్లు చెప్పారు. అక్షయ పాత్రకు ఆర్జీయూకేటీ యాజమాన్యంకు ఇప్పటికే ఒప్పందం కూడ జరిగినట్లు చెప్పారు. అక్షయ పాత్ర సంస్థ ప్రతినిధులు కూడ ట్రిపుల్ ఐటీలను పరిశీలించడం జరిగిందని చెప్పారు. విద్యార్థులకు ఉత్తమ బోధన తో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేస్తామని విద్యార్థులకు హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ వెంట మాజీ దేవస్థానం ఛైర్మన్ జివి రమణ, డివి సుబ్బారెడ్డి, ఎస్పీ జయచంద్రారెడ్డి, ఇడుపులపాయ యూనిట్ ఇన్ ఛార్జ్ పోతిరెడ్డి శివ, కావలి భాను కిరణ్, ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పించా ప్రాజెక్ట్ కింద వరి నాట్లు..



**సుండుపల్లి, ఆగష్టు03,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని పించా ప్రాజెక్టు కుడి కాలువ క్రింద రైతులందరూ వరి నాట్లు ప్రారంభించారని, ఈసారి పించ ప్రాజెక్టు పూర్తిగా నిండి రెండు పంటలు వస్తాయని నమ్మకంతో ఉన్నామని, రైతులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఆదర్శ రైతు అమృనాయక్ మాట్లాడుతూ పించ కుడి కాలువ లీకేజీల ద్వారా వస్తున్నటువంటి నీటితో రైతులు అందరం కలిసి వరి నాట్లు వేస్తున్నామని తెలియజేశారు.

## పెండ్లిమర్రి హైస్కూల్లో మెడికల్ క్యాంప్

**పెండ్లిమర్రి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

మండలంలోని పెండ్లిమర్రి హైస్కూల్లో ఆదివారం మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో చెవిటి, మూగ, గుడ్డి వారికి చికిత్సలు నిర్వహించి తగిన మందులు సరఫరా చేయడం జరిగిందన్నారు. మొత్తం 145 మంది చికిత్సలు హాజరయ్యారని వారిలో 127 మందికి వివిధ రకాల చెవిటి మిషన్లు, అద్దాలు తదితర అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు, రోగులు తదితరులు పాల్గొన్నారు.



## పురస్కారం మరింత బాధ్యతను పెంచింది...!

**మైదుకూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

పురస్కారం తన కర్తవ్యాన్ని ,బాధ్యతను మరింత పెంచిందని రచయిత ,చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ అన్నారు. హైదరాబాద్ మెగా పట్టణం లకిడికపూల్ పీఎం బిర్లా మ్యూజియం భాస్కర ఆడిటోరియం లో హెల్పింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు పి శిరీష రెడ్డి ఆధ్వర్యంలో కీర్తిరత్న ఐకానిక్ టాలెంట్ పురస్కారాల సభ ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్యమైన అతిథిగా విచ్చేసిన తెలుగు చలనచిత్ర నటుడు సూర్య చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ పురస్కారాలు రచయితలకు, చరిత్రకారులకు తమ విధిని ఉత్తేజితంగా జరపడానికి దోహదపడతాయన్నారు.ఐదు సంవత్సరాలుగా సాహిత్యంలోనూ చరిత్ర పరిశోధనలోను విశేష కృషి చేసినందుకు గుర్తింపు లభించిందని వివరించారు.వన్నూరమ్మ ఎదురులేని పాలే గత్తె పుస్తక రచనలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నానని గుర్తు చేశారు.రచయితలను, కవులను, చరిత్రకారులను ప్రభుత్వ పరంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వెల్లడించారు.రెండు తెలుగు రాష్ట్రాలలో సాహిత్యంలోనూ చరిత్రపరంగా భవిష్యత్తులో మరింత సమాచారాన్ని నూతనంగా అందించడానికి విశేషమైన కృషి చేస్తానని తెలిపారు.. హైదరాబాద్ టీవీ9 రాడ్ కాస్టింగ్ ఇంజనీర్ రసూల్ , శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ ఆకుల సురేష్ వారి శిష్య బృందం అవార్డు గ్రహీత ను పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రికవరీ చీఫ్ శేఖర్ నాయక్, ఎల్. హెచ్. పి .ఎస్ ,ఎస్ సి ఎస్ టి కమిషనర్ రాంబాల్ నాయక్, మోహన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, సాఫ్ట్వేర్ ఇంజినీర్ బండి పిచ్చోళ్ళ తిరుమలేష్, అశోక్, ఆంధ్రప్రదేశ్ పత్రా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలుపుల శ్రీనివాస్ నాయుడు, పత్రా మంచాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.









## పాఠశాలల్లోకి ప్రజాస్వామ్యవాదులు అనుమతి లేదని చెప్పడం సిగ్గుచేటు




మదనపల్లె క్రైమ్, ఆగస్టు 3 ప్రభాతవార్త.

ప్రభుత్వ పాఠశాలలోనికి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లి దండ్రులు మినహా, ఎవరిని అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహా అన్నారు. ఆదివారం మదనపల్లి పట్టణంలో జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా కమీషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మూలంగా విద్యార్థులు తమ స్వేచ్ఛను కోల్పోతారని అన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకునేందుకు వెళ్ళిన వారికి ఈ ఉత్తర్వులు ద్వారా అనుమతులు ఉండబోవని దీని ద్వారా విద్యార్థుల సమస్యలు బయటకి రాకుండా విద్యార్థుల నోరు నొక్కే ప్రయత్నమేనన్నారు. ఇటువంటి వైఖరి సరైనది కాదన్నారు. విద్యాశాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరిపి, విద్యార్థి సంఘాలు కృషిని అవలంబించడం జరిగింది అన్నారు. ఎటువంటి రాజకీయాలకు తావివ్వొద్దని చెప్తున్న విద్యాశాఖ పిటిఎం పేరుతో చేసేందేమిటని విమర్శించారు. ఎంఎల్ఎలు వారి అనుచరులు పాఠశాలల్లోకి వచ్చి సమస్యలు చెప్పినవారిని బెదిరించిన సంఘటనలు కూడా ఉన్నాయని, అటువంటి సమయంలో విద్యాశాఖ ఎటువంటి చర్యలు చేపట్టిందో తెలపాలన్నారు. ఈ ఉత్తర్వులు ద్వారా ఇక నుండి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల వ్యాపారం, అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందన్నారు. వెంటనే ఈ ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు సమీర్, బన్నీ, అర్జున్, శ్రీధర్ నాయక్, జీవన్ నాయక్, శివకుమార్ నాయక్, డి.రాజు, హర్ష, భాను, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ నాయకుడికి ఘనమైన నివాళి..




తొండూరు ఆగస్టు3 ప్రభాతవార్త :

స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఐ పులివెందుల ఏరియా సమితి ఆధ్వర్యంలో కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి 39 వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు మాట్లాడుతూ ప్రజలే ధ్యాసగా అభివృద్దే శ్వాసగా నమ్ముకున్న సిద్ధాంతాలతో కడవరకు ఆదర్శ కమ్యూనిస్టుగా శ్రమజీవులు అభ్యున్నతికై జీవితాన్ని ధారపోసిన మహా మనిషి ఈశ్వర్ రెడ్డి పేరును గండికోట రిజర్వాయర్‌కు అప్పటికి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పెట్టడం జరిగింది. జీతాన్ని సైతం పార్టీ అభివృద్ధికి అందించిన త్యాగశీలి జీవితం నేటి రాజకీయ నాయకులకు యువతకు ఆదర్శమని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బుర్రి ఈశ్వరయ్య, సింహాద్రిపురం మండల కార్యదర్శి అమీర్ భాష, తొండూరు మండల నాయకులు విజయకుమార్, అంకన్న, అనిల్, వినయ్, సురేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

## మిగిలిన సీట్ల భర్తీకి ఆహ్వానం

రామాపురం ఆగస్టు3 ప్రభాతవార్త :

రామాపురం మండలం గంగనేరు క్రాస్ వద్ద వున్న డా. బి ఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2025 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి మిగిలివున్న సీట్ల భర్తీకి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పులి రామకృష్ణ ఆదివారం తెలిపారు.ఎస్సీ,బీసీ విభాగానికి చెందిన 120 సీట్లు ,5 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ బిపిసి,ఎంపీసీ,సీట్లు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆగస్టు 8 వ తేదీ లోపల విద్యార్థి ఆధార్, కులధృవీకరణ పత్రం చరవాని సంఖ్యతో నేరుగా కళాశాలకు వచి సంప్రదించాలని కోరారు.

## ఉద్యోగుల ఆర్థిక విషయాలపై ఉద్యమిస్తాం




ఎడ్యుకేషన్ ఆగస్టు 4 ప్రభాతవార్త :

ప్రభుత్వం నుండి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక విషయాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పుల రామాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగులు విసిగిపోయి నూతన ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారని, ఒక సంవత్సరం గడుస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి ఆర్థిక ఆర్థిక విషయాలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం పై ఆందోళన వ్యక్తం చేస్తున్నామని, ఇకనైనా ప్రభుత్వం త్వరలో తగిన నిర్ణయం తీసుకుని ఉద్యోగులకు రావాల్సిన 25 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని, డిమాండ్ చేశారు 12వ వేతన సవరణకు సంబంధించి వెంటనే సిట్టింగ్ జడ్జితో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, జూలై 2022 నుంచి వర్తించేలా 30 మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, బకాయి పడ్డ ఐదు డిఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలన్నింటినీ కలుపుకొని ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవ ప్రముఖ్ ఎరుకల రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షులు బాలానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో
# బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

మదనపల్లె క్రైమ్, ఆగస్టు 3 ప్రభాతవార్త.

స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల కు ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడం రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ బీసీ హక్కుల సాధనకు తాము ఎన్నో ఏళ్లుగా పోరాటాలు సాగిస్తూ ఉన్నామన్నారు. తమ పోరాట ఫలితంగా బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారందరూ ఏకతాటిపై వచ్చి తమ సత్తాను చాటుతున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బీసీలు సత్తా చాటి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఇందుకోసం కమిటీ నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బిసి కమిటీలను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎం. వెంకటేశ్వర, రాయలసీమ ఉపాధ్యక్షుడిగా ఉప్పు వెంకటేష్, రాయలసీమ సహాయ కార్యదర్శిగా చామంతుల సిద్దయ్య, రాయలసీమ గౌరవ అధ్యక్షుడిగా షేక్ కరామత్ భాషా, రాయలసీమ సహాయ కార్యదర్శులుగా అమరనాథ్, సి. రామాంజ నేయులు, అన్నమయ్య జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా గోవింద శ్రీనివాసులు, పార్లమెంట్ గౌరవాధ్యక్షుడిగా రమణ, అన్నమయ్య జిల్లా సలహా సహాయ కార్యదర్శులు గా బి.వెంకటేష్, బి. మహేశ్వర్, బి.కుమార్, కే ఎర్రప్ప లు నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షులుగా బిఏ రాజు, జయన్న, డివిజన్ ఉపాధ్యక్షుడిగా వెంకట శివయ్య, అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శిగా మోహన్, మదనపల్లె ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, మదనపల్లె గౌరవాధ్యక్షుడిగా కె. సూర్యనారాయణ, మదనపల్లి సహాయ కార్యదర్శిగా పి. శ్రీనివాసులు తంబళ్లపల్లి నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా సిక్కె శ్రీనివాసులు లను ఎన్నుకున్నారు.




## 5జి నెట్‌వర్క్‌పై వెబినార్

మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం విఎంవేర్, విండ్‌రివర్‌తో 5జి నెట్‌వర్క్‌పై వెబినార్‌ను నిర్వహించారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో 2025 5జి నెట్‌వర్క్‌పై సాంకేతికంగా సంపన్నమైన వెబినార్‌ను నిర్వహించారు. ఈ వెబినార్‌లో సిఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం ప్రొఫెసర్, అధిపతి డాక్టర్ ఎం.రోహిణి మాట్లాడారు. విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ధోరణిలకు అనుగుణంగా ఉండాల్సిన అంశాన్ని చెప్పారు. 5జి, అంతకుమించిన డిమాండ్లను నిర్వహించగల స్కేల్‌బుల్, క్లౌడ్ నెట్‌వర్క్‌లను వంటి ప్లాట్‌ఫామ్‌ల ఎలా కీలకపాత్ర పోషిస్తాయో తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టపి పి.రాముడు, వివిధ విభాగాల డీన్‌లు, అధిపతులు పాల్గొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెలికాం, క్లౌడ్ మౌళిక సదుపాయాల రంగంలో క్రాస్, డిపెన్లరి ఆసక్తిని కనపరిచారు.

## అన్నదాత సుఖీభవతో రైతుల్లో ఆనందం
### టిడిపి పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్



ధాన్యాభిషేకం చేస్తున్న దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :

అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల్లో ఆనందం నెలకొందని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ తెలిపారు. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఆదివారం నిమ్మనపల్లె సర్కిల్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ధాన్యాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జె.వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒకొక్కటి నెరవేర్చుతున్నారన్నారు. తొలుత పెంచిన పెన్షన్‌లను ఎన్‌టిఆర్ భరోసా కింద రూ.4 వేలు చేయడం జరిగిందన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఈనెల 15నుంచి ఉచిత బస్సు సౌకర్యం, చేనేతలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్, పవర్‌లూమ్స్ 500యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తొందన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారన్నారు. సుపరిపాలన తొలిఅడుగు పేరుతో ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిరత్న, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యేచే పెన్షన్‌లపై అవగాహన సదస్సు

మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :

మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో సోమవారం ఉదయం 9గంటలకు నూతనంగా మంజూరైన వితంతువు పెన్షన్లపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 9.30గంటలకు మదనపల్లె రూరల్ మండలంలో మంజూరైన పెన్షన్లపై మండల పరిషత్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఉదయం 10గంటలకు విజయభారతి స్కూల్ నందు మ్యాజిక్ తరగతుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఉదయం 10.30గంటలకు నిమ్మనపల్లె మండలంలో పెన్షన్‌దారుల అవగాహన సదస్సు, 11.30 గంటలకు తవళం నందు గుడిప్రారంభోత్సవం, 12.30గంటలకు పొన్నూటిపాలెం పంచాయితీలోని పనసమాకులపల్లె గుడి విగ్రహ ప్రతిష్ట, మద్యాహ్నం 2.30గంటలకు రామసముద్రం మండలం ఎంపిడిఓ కార్యాలయంలో పెన్షన్‌దారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మిట్స్ యూనివర్సిటీలో పిజి ప్రవేశ పరీక్ష

కురబలకోట ఆగస్టు 3 ప్రభాతవార్త

నీట్ (జాతీయ అర్హత మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష) పిజి పరీక్షను మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లో విజయవంతంగా నిర్వహించబడింది అని యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులను కేంద్రానికి కేటాయించారు అని, వారిలో 140 మంది అభ్యర్థులు హాజరయ్యారు మరియు 60 మంది గైర్హాజరయ్యారు అని అన్నారు. పరీక్ష మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి అని, పరీక్ష ఎటువంటి అంతరాయాలు లేకుండా సజావుగా ప్రారంభమైందన్నారు.

## స్కూటరిస్టు గాయాలు.

రామాపురం ఆగస్టు 3 ప్రభాతవార్త

కర్నూలు చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం కసి రెడ్డి గారి పల్లి పంచాయతీ హరిజనవాడకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిలబడి ఉన్న కారును స్కూటర్ ఢీకొని స్కూటరిస్టు బోనం శెట్టి రవీంద్రకు గాయాలు అయినట్టు రామాపురం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు గువ్వల చెరువు హరిజనవాడ సమీపంలో ఆగి ఉండగా సరస్వతి పల్లెకు చెందిన బోనంశెట్టి రవీంద్ర టీవీఎస్ ఎక్సెల్ లో కడప నుంచి సరస్వతి పల్లెకు వస్తూ ఉండగా మార్గమధ్యలోని గువ్వల చెరువు సమీపంలోని హరిజనవాడ వద్దకు రాగానే ఆగి ఉన్న కారును స్కూటర్ ఢీకొంది. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్ కు తరలించారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామపురం పోలీసులు తెలిపారు.

## యోగనేలమల్లేశ్వరస్వామి గుడి పునఃప్రతిష్ట

నిమ్మనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం తవళం అటవీప్రాంతంలో వెలసిన యోగనేలమల్లేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారంలో మహాగణపతి పూజ, శిఖర కలిశస్థాపన, ధ్వజస్థంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవాలయ తాత్కాలిక ఛైర్మెన్ రామక్రిష్ణ, సర్పంచ్ రెడ్డప్ప, పార్టీ మాజీ మండల అధ్యక్షులు రాజన్న, ఈఓ మంజుల, ఆలయ ధర్మకర్త సిఎన్.రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొనగా మదనపల్లె నివాసి గుత్తాహరిక్రిష్ణ భారీ సంఖ్యలో అన్నదానం చేశారు.

## వితంతు ఫించన్లు ఎమ్మెల్యేచే పంపిణీ

నిమ్మనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలంలో నూతనంగా మంజూరైన వితంతు పించన్ల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొననున్నట్లు ఎంపిడిఓ రమేష్ తెలిపారు. అదే విధంగా ఫించన్‌దారులకు ఆయన నగదు పంపిణీ చేయనున్నారు.

## మూగజీవాల సేవ మన పూర్వజన్మ సుకృతం



తంబళ్లపల్లె ఆగస్టు 3 ప్రభాతవార్త ః

ప్రకృతిలోని మూగజీవాలకు సేవచేసే భాగ్యం మనకు దక్కడం మన పూర్వ జన్మ సుకృతమని మదనపల్లె పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ నాయుడు హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల పశువైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మారుమూల ప్రాంతాల కుగ్రామాలలోని పాడి పశువులు, గొర్రెలు, మేకలు మూగజీవాలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. మూగజీవాల సంరక్షణ పై క్షేత్రస్థాయిలో పర్యటించి వైద్యం తో పాటు సలహాలు, సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను వైద్య సిబ్బంది సకాలంలో రైతులకు చేరువ చేయాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఏడిఏ శ్రీనివాసులు నాయుడును పశువైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ సుమిత్ర, తంబళ్లపల్లె పశు వైద్యాధికారి డాక్టర్ విక్రమ్ రెడ్డి, పెద్దమండెం పశు వైద్యాధికారులు డాక్టర్లు ఉస్మాన్,చరిత రెండు మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులు వయోవృద్ధుల గుర్తింపు శిబిరం



సిద్ధవటం ఆగస్టు 3 ప్రభాతవార్త :

సిద్ధవటం జడ్పీ హైస్కూల్ నందు దివ్యాంగులు వయోవృద్ధుల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేసినారు భారత ప్రభుత్వంచే కడప జిల్లాలోని దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సహాయ జీవన పరికరాలు పంపిణీ కొరకు జిల్లా పరిపాలన యంత్రాంగం కడప జిల్లా వారి సహకారంతో భారత ప్రభుత్వము కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలిమ్కో ద్వారా అర్హత మరియు అవసరం కలిగిన దివ్యాంగులను పరీక్షించి సహాయ పరికరం కొరకు ఎంపిక చేసేందుకు ప్రత్యేక గుర్తింపు శిబిరం ఏర్పాటు చేయడమైనది ఈ శిబిరానికి 50 మంది దివ్యాంగులు మరియు వయోవృద్ధులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు వచ్చిన వారికి పరీక్షలు చేయడమైనది పరీక్షలు చేయించుకున్న వారికి రెండు నెలల లోపల వారికి అవసరమైన కిట్స్ అందజేస్తామని నిర్వాహకులు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో డిజేబుల్ వెల్ఫేర్ సూపరిటెండెంట్ శివరామకృష్ణారెడ్డి ఆలింకో టీం సభ్యులు సహిత విద్య ఉపాధ్యాయులు పద్మావతి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో ఛైర్మన్‌గా నల్లారి చంద్రకుమార్‌రెడ్డి

కలికిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



కలికిరి మండల కేంద్రంలో ఉన్న సింగిల్ విండో ఛైర్మన్‌గా కలికిరి మండలం మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగింది. నల్లారి చంద్రకుమార్‌రెడ్డి పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సోదరుడు. ఆయన గత 30 సంవత్సరాలుగా నిత్యం ప్రజా సేవలో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నాడు. ఆయన సేవలను గుర్తించి గతంలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కలికిరి మండలం జడ్పీటీసీ పదవి ఇవ్వడం జరిగింది. ఆయన సేవలను గుర్తించి కలికిరి మండలం సింగిల్ విండో ఛైర్మన్‌గా నియమించడం జరిగింది. సోమవారం కలికిరి సింగిల్ విండో ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఉచిత మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

బ్రహ్మం గారి మఠం ఆగస్టు 03 ప్రభాతవార్త:



బ్రహ్మంగారిమఠంలోని స్థానిక జడ్పీ బాలుర హై స్కూల్ నందు మైదుకూరు పట్నంలో ఎస్ ల్ అర్ హాస్పిటల్ వారు డాక్టర్ మూలే రామ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు ఈ క్యాంపు నందు నిదిబి 2D- echo కొలెస్ట్రాల్ షుగర్ పరీక్ష లంగ్ పరీక్ష ఏ ఈ సి (అలర్జీ పరీక్ష) HBA1C సి బిపి మొదలగు పరీక్షలు అన్నీ కూడా దాదాపుగా నాలుగు వేల రూపాయలు విలువచేసే పరీక్షలు అన్నియు ఉచితంగా నిర్వహించారు వందకు పైగా ఓపి రావడం జరిగింది. ఈ మెగా క్యాంప్ నందు ఎంపీపీ చిలికాంపల్లి వీర నారాయణరెడ్డి మరియు మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి హాజరై క్యాంపు ని సమీక్షించి విజయవంతం చేయడం జరిగింది.

## అదుపుతప్పి లారీ బోల్తా..

ముద్దనూరు, ఆగస్టు,3, ప్రభాతవార్త:



కడప తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలో ఆదివారం మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఎర్రగుంట్ల నుంచి తాడిపత్రి వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటనలో లారీ డ్రైవర్ కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు పేర్కొన్నారు. లారీ డ్రైవర్ రాంబాబు ఎర్రగుంట్ల నుంచి తాడిపత్రి సమీపంలోని బంజారా సిమెంట్ ఫ్యాక్టరీకి బొగ్గులోడుతో వెళుతుండగా ముందు టైరు పగలడంతో లారీ అదుపుతప్పి రహదారి వెంబడి ఉన్న డివైడర్ ను ఢీకొని మోరీ లోకి దూసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

## ఉచిత ఆర్థోపెడిక్ మెగా వైద్య శిబిరం

ఎడ్యుకేషన్ ఆగస్టు 3 ప్రభాతవార్త :



నగరంలోని నాగరాజ్‌పేటలో ఉన్న డా. ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్వహణలో ఉచిత ఆర్థోపెడి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో ఉచితంగా యూరిక్ ఆసిడ్, తీలీదీ టెస్టులు కాన్సల్టేషన్లు నిర్వహించారు డాక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఒక అనుభవజ్ఞుడైన ఆర్థోపెడిక్ వైద్యులు, ప్రత్యేకంగా బిడియం (Bone Mineral Density), యూరిక్ ఆమ్లం, జలద్రవ్యం పరీక్షలతో పాటు రోగుల కన్సల్టేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌రే, ఎండి పరీక్షలు మరియు ఫిజియోథెరపీ సలహాలు ఉచితంగా అందించబడ్డాయి. దాదాపు 180 మందికి పైగా పేషంట్లు పాల్గొన్నారు, వీరిలో వృద్ధులు, మహిళలు, శిశువులు, వృద్ధ పెట్టుబడులు పొందిన వారు కూడా ఉన్నారు.రక్తపరీక్షలు, ఎండోమెట్ బిడియం పరీక్షలు సహా అవసరమైన సూచనలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అధిక యూరిక్ ఆమ్లంతో బాధపడే వారికి ప్రొఫెషనల్ డైటరీ సలహాలు. సూచనలు చేశారు BMD టెస్టు ఫలితాలతో osteoporosis, osteopenia వంటి దీర్ఘకాలిక పరిస్థితులు గుర్తించి, ఫిజియోథెరపీ లేదా ఔషధ చికిత్సలను సూచించడం. జరిగింది మెగా శిబిరంలో అందించిన సేవలకు గాను స్థానిక ప్రజల నుంచి ప్రశంసలు ఎదుర్కొన్నారు బిడియం టెస్ట్ కోసం చాలా గొప్ప అవకాశమిచ్చారు శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరు కొనియాడారు.

## మిథున్ రెడ్డి కడిగిన ఆణిముత్యం వలె బయటికొస్తారు



హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైసీపీ నాయకులు

పీలేరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :

యర్రగుంట్లపల్లి శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం లో పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసినందుకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం వైఎస్ఆర్సిపి నాయకులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి 101టెంకాయలు కొట్టి ప్రార్థించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ లేని లిక్కర్ కేసులో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో ఉంచడం అన్యాయమని అక్రమమని చంద్రబాబు నీచ బుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. పేదల పాలిటి పెన్నిధి కార్యకర్తలు ఏ ఇబ్బంది పడిన వారికి అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించే మా మిథున్ రెడ్డి మచ్చలేని చంద్రుని వలె జైలు నుండి బయటకు రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరజా చంద్రారెడ్డి, ఎంపిటిసి అమరనాథ రెడ్డి , మాజీ ఎంపిటిసి ముదుపుల వేముల భాను ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలం నరేంద్ర రెడ్డి, వైకాపా ఐటి వింగ్ ప్రవీణ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైకాపా బిసి కార్యదర్శి వినోద్ గౌడ్, వైకాపా కార్యకర్తలు మల్లి, రమణ, రాజారెడ్డి, రాజశేఖర్ , రంజిత్, సురేంద్ర రెడ్డి, లవకుమార్, సుధాకర్, అశోక్ , తదితరులు పాల్గొన్నారు.

## స్థల సేకరణకై ఎమ్మెల్యేను కలసిన...



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పీలేరు ఆగస్టు 3 ప్రభాతవార్త:

నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు భాగంగా మెడికల్ క్యాంపులు, కంటి ఆపరేషన్లు పలుమార్లు ఆయుర్వేద క్యాంపులు మాస్టర్ చెకప్ లతోపాటు స్ఫూర్తి దాయక విద్యా కార్యక్రమాలను గత 5 సంవత్సరాలుగా నిర్వహిస్తు ప్రజాహిత కార్య క్రమాల్లో పాల్గొంటున్న APRGREA అధ్యక్షులు డాక్టర్ వై ఆదినారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షరు డాక్టర్ వేంపల్లి అబ్దుల్ ఖాదర్, స్టేట్ సెక్రెటరీ సి. సురేంద్ర రెడ్డి మరియు ఇతర సభ్యులు, పీలేరు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలసి, కార్య క్రమాలకు భవన నిర్మాణమునకు స్థలము మంజూరు చేయించ వలసినదిగా అభ్యర్థించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సి. నారాయణ రెడ్డి, కె. కృష్ణారెడ్డి, బి.సరోజమ్మ, యమ్.దేవేంద్ర పి.లక్షయ్య, రమణారెడ్డి, రెడ్డి పి. సత్యనా రాయణరావు, నారాయణమూర్తి, బసవయ్య, నాగప్ప పాల్గొన్నారు.

## ఎస్‌పిజి చర్చి ఫాదర్ బిషప్‌గా ఎంపిక

ముద్దనూరు, ఆగస్టు, 3, ప్రభాతవార్త:



స్థానిక పులివెందుల రహదారి సమీపంలో ఉన్న ఎస్పీజీ (సి ఎస్ ఐ) సంఘ గురువు డీనరి ఛైర్మన్ కే సంతోష్ ప్రసన్న రావు బాబు ఆదివారం నంద్యాల బిషప్‌గా ఎంపికైనట్లు తెలిపారు. కడప జిల్లాలో మొట్టమొదటిసారిగా నంద్యాల బిషప్‌గా ఎన్నిక కావడంతో ముద్దనూరు ఎస్ పి జి, సి ఎస్ సంఘ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. చెన్నై లో ఉండే మాడ్రేటర్ రూబేను మార్క్ తండ్రి నంద్యాల బిషప్ గా ఎన్నిక చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం నాడు నంద్యాల చర్చిలో బిషప్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు వివరించారు.

## సిద్ధవటం కాజ్వేపై పోలీసుల గస్తీ ఏర్పాటు



సిద్ధవటం ఆగస్టు 3 ప్రభాతవార్త

పెన్నా నదిలో నీటిమట్టం పెరగడంతో మండల ఎస్సై మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పోలీసులు ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టారు మండల కేంద్రమైన సిద్ధవటం పెన్నా నదిలో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు పెన్నా నదిలో నీటిమట్టం పెరగడంతోలో కాజ్వే సమీపాన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆదివారం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ పెన్నా నదిలో నీటి ప్రవాహం భారీగా రెట్టింపు కావడంతో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు ఆదేశాలతో మండల ఎస్సై మహమ్మద్ రఫీ సూచకు లోకాజ్వే వద్ద, ప్రమాదాల నివారణ కొరకై కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని చేపల వేట జాలర్లు పెన్నా నదిలో ఎవరు దిగవద్దని నది పరివాహ ప్రాంతాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా కనపడితే సమాచారం తెలపాలని ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

## యాగశాలకు భూమి పూజ



పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:

బి.మఠం మండలం పి.కొత్తపల్లె సమీపం లోని కోడూరు దుర్గమ్మ తల్లి దేవస్థానం లో హోండా రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యం లో వారి సొంత నిధులు రూ.15 లక్షలతో యాగ శాల నిర్మాణానికి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యం లో ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు యాగ శాల నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. దుర్గమ్మ దేవాలయం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన పుత్రుల ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి

వేంపల్లి: ఆగస్టు 03 (ప్రభాత వార్త):



గూడెంచెరువులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి జిల్లాలో గిరిజనులకు నెలకొన్న సమస్యలు భూమిలేని వారికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని గిరిజనకాలనీ ప్రాంతాలలో మంచినీటి ట్యాంకులు, మారుమూల తండాలకు రోడ్లు , నూతన భవన నిర్మాణాలు ఆరోగ్య వసతి ఎస్టి బ్లాక్ పోస్టులను కల్పించి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని గిరిజన ప్రాంతాలను రూపకల్పన చేసేందుకు సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు వివరించినట్లు ఆయన తెలిపారు.

# రక్షణ గోడను మరిచిన ప్రభుత్వ అధికారులు

**కెసి కెనాల్ కాలువ, స్థలాలపై ఆక్రమణలను అరికట్టాలి.**





**మైదుకూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

మైదుకూరు పట్టణంలోని నంద్యాల రోడ్డు కేసీ కెనాల్ కాలువపై ఉన్న బ్రిడ్జి పైన రక్షణ గోడను గత ప్రభుత్వం ఇప్పుడున్న ప్రభుత్వం అధికారులు మరిచారు. బ్రిటిష్ కాలం నాటి కెసి కెనాల్ కాలువ ఎంతోమంది రైతులకు ఉపయోగపడుతూ ఉపయోగంలో ఉన్నది. రాయలసీమకు ఎంతో అవసరమైన కేసీ కెనాల్ కాలువ వాటికి సంబంధించిన బ్రిడ్జిలు, ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న బంగ్లా, ప్రధాన కాలువల పైన ఆక్రమణలపై ఎలాంటి దృష్టి సారించడం లేదు, రాయలసీమలో ప్రధానంగా కడప జిల్లా మైదుకూరు ప్రాంతానికి ఎంతో ఉపయోగకరంగా రైతన్నలకు నీరునందిస్తూ ఆరుగాలం పండించి దేశ ప్రజలకు అన్నం పెడుతున్న ఈ కాలువ ఆక్రమణలు నుండి కాలువను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వాలు చేయకపోయినా ఇప్పుడున్న ప్రభుత్వాలు రైతన్నల కోసం కాలువ, కెసి కెనాల్ స్థలాల ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై, చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.కొన్నిచోట్ల రైతులు వ్యవసాయ పనుల కోసం కట్టపై వాహనాలు వెళ్లాలంటే మొదట్లోనే అడ్డుకట్ట వేస్తున్నారు. ఆక్రమణ దారులు, వీటిపై అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు,ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, కేసీ కెనాల్ అధికారులు, దానికి సంబంధించిన ప్రజా ప్రతినిధులు పటిష్ట చర్యలు చేపట్టి ఆక్రమణల చెర నుండి స్థలాలను కాపాడాలని రైతన్నలు వేడుకుంటున్నారు. ప్రధాన కాలువ ఆక్రమణలతో కుచించుకు పోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. కేసీ కెనాల్ ప్రధాన కట్టలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఎంతో అవసరం. సాగునీటి సంఘాల నాయకులు కార్యకర్తలు వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కుషావతినదీ తీరంలో వ్యర్థాలు తొలగించండి

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



**గాలివీడు, ఆగస్టు 3(ప్రభాతవార్త):**

పట్టణంలోని కుషావతి (చిన్నేరు) నదీ తీరాన ఇబ్బదిముబ్బడిగా వేస్తున్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని రాష్ట్ర యువజన, రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం గాలివీడులో పర్యటించిన మంత్రిని కలిసిన స్థానికులు కుషావతీ నదీతీరంలో వ్యర్థాలు వేయడం వలన దుర్వాసనతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న తాము తీవ్ర అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కొరకు అనేకమార్లు వ్యాపారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మంత్రి దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన తక్షణమే వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అక్కడున్న దంపింగ్‌యార్డును కేటాయించిన చోటకు తరలించాలని సూచించారు.

## అవినీతి కేసుల్లో ప్రభుత్వ ఉద్యోగుల దోషిత్వ నిర్ధారణపై స్టే ఇవ్వకూడదు

**(సుప్రీం కోర్టు తీర్పు)**

**బద్వేలు లీగల్, ఆగష్టు 03 ప్రభాతవార్త :**

అవినీతి నిరోధక చట్టం-1988 క్రింద ప్రభుత్వ ఉద్యోగి యొక్క దోషిత్వ నిర్ధారణపై స్టే ఇవ్వడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. మిగతా న్యాయ స్థానాలు కూడా దీనినే పాటించాలని నొక్కి వక్కాణించింది. శిక్షను సస్పెండ్ చేసి దోషిత్వ నిర్ధారణను నిలిపివేసేందుకు నిరాకరించిన గుజరాత్ హై కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కన్పించడం లేదంటూ జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ప్రసన్న బీ వరలేలతో కూడిన ధర్మాసనం నొక్కి చెప్పింది. "కె.సి.సరీన్ ఎదిరి సిబిఐ, చండీగఢ్ (2001)6 ఎస్‌సిసి 584 మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, న్యూఢిల్లీ ఎదిరి యం.యన్.శర్మ (2008) 8 ఎస్‌సిసి 549 వ్యాజ్యాలలో ఈ కోర్టు అవినీతి దోషిత్వ నిరూపణలపై స్టేలు విధించడానికి దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న తీర్పుపై విభిన్న వైఖరి తీసుకోవడానికి ఎటువంటి సమర్థనీయమైన కారణం కన్పించడం లేదు, ఆ ఉత్తర్వు జోక్యం చేసుకోవాల్సినంత బలహీనతతో ఏమీ లేదని మేము దృఢంగా భావిస్తున్నాము" అని న్యాయస్థానం పేర్కొన్నది. ప్రభుత్వ ఉద్యోగి అయిన పిటిషనర్ అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-7, సెక్షన్-12 మరియు సెక్షన్-13(1)(డి) క్రింద సెక్షన్-13(2) తో కలిపి నేరాలకు పాల్పడ్డాడు. సెక్షన్-12 తో కలిపి సెక్షన్-7 క్రింద నేరానికి ట్రయల్ కోర్టు అతనికి 2 సంవత్సరముల కఠిన కారాగార శిక్ష, రు.3,000/-లు జరిమానా కూడా విధించింది. గుజరాత్ హై కోర్టులో శిక్షకు వ్యతిరేకంగా పిటిషనరు అప్పీలు దాఖలు చేసి శిక్షపై స్టే ఇవ్వాలని అభ్యర్థించగా ఏప్రిల్ 3, 2023 న హై కోర్టు ఈ దరఖాస్తును అనుమతిస్తూ శిక్షను నిలిపివేసి పిటిషనరుకు బెయిల్ మంజూరు చేసింది. అయితే దోషిత్వ నిర్ధారణను నిలిపివేయడం లేదని, అది యధావిధిగా అమలులోనే ఉంటుందని కూడా హై కోర్టు సుస్పష్టం చేసింది. దాంతో అతను సుప్రీం కోర్టును ఆశ్రయించగా కె.సి.సరీన్ ఎదిరి సీబీఐ, చండీగఢ్ మరియు సీబీఐ, న్యూఢిల్లీ ఎదిరి యం.యస్.శర్మ కేసుల్లో తన మునుపటి తీర్పులను ప్రస్తావిస్తూ అవినీతి ఆరోపణలకు పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగుల శిక్షలను కోర్టులు నిలిపివేయకూడదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పిందని గుర్తు చేస్తూ ఇందుకు భిన్నమైన వైఖరి తీసుకోవడానికి సమర్థనీయమైన కారణం లేదని పేర్కొంటూ హై కోర్టు ఆదేశంలో జోక్యం చేసుకోవలసినంతటి బలహీనత ఏదీ కన్పించడం లేదని ధర్మాసనం తేల్చి చెబుతూ పిటిషన్‌ను అనర్హమైనదిగా కొట్టివేస్తూ ఈ తీర్పును ప్రకటించింది. (ఎస్ఎల్‌పి (క్రిమినల్) రఘునాథ్ బన్స్‌రోపాన్ పాండే ఎదిరి స్టేట్ ఆఫ్ గుజరాత్ డైరీ నెం.4666/2025)

# వైభవంగా జీకే నేచర్ వ్యాలీ వెంచర్ ప్రారంభం

**హాజరైన పీలేరు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు**



వెంచర్ ప్రారంభంలో పాల్గొన్న నాయకులు

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

మదనపల్లె-పుంగనూరు జాతీయ రహదారి పక్కన ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల వెనుకవైపున జీకె నేచర్ వ్యాలీవెంచర్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, దొమ్మలపాటి రమేష్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలు జీకె నేచర్ వ్యాలీ వెంచర్‌ను ప్రారంభించారు. వెంచర్ యజమానులు జీకె. గోపాల్‌రెడ్డి, టి.క్రిష్ణమనాయుడు(టికెఎన్)ల ఆధ్వర్యంలో ఈ వెంచర్ ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నేచర్ వ్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వేలాది మంది హాజరయ్యారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, రిటైర్డు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, రైతులు అనేక వర్గాలకు చెందిన వారు హాజరయ్యారు. 42ఎకరాల విస్తీర్ణంలో నేచర్ వ్యాలీ వెంచర్‌ను సువిశాలమైన రోడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చనిచెట్ల మధ్య వెంచర్ వేశారు. ఇలా ఎన్నో హంగులతో ఉన్న ఈ నేచర్ వ్యాలీని కనులపండుగలా ప్రారంభించారు. వెంచర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిధులకు విందు ఏర్పాటు చేశారు. వెంచర్లు కొనుగోలుచేసిన వారికి, అతిధులకు వెంచర్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ జంగాల శివరామ్, కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరనాథ్‌రెడ్డి, రిటైర్డు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు జంషీర్, ఎన్ఆర్ఐ మాధవరెడ్డి, వరపన కిరణ్‌రెడ్డి, రాజేష్, కనుగొండ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దృఢత్వం ఉంటుంది



క్రీడాకారులను పరిచయం చేసుకున్న దృశ్యం

**పీలేరు ఆగస్టు 3 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ క్రీడా పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల పీలేరు నందు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి డివైఈవో లోకేశ్వర్ రెడ్డి విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్యం విద్యా రంగంలో నిరంతరం పిల్లలతోటి బోధనలో నిమగ్నమై ఉంటూ ఉపాధ్యాయులకు ఇలాంటి క్రీడలు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయుల్లో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ఉపాధ్యాయుల పట్ల సాన్నిహిత్యం కూడా ఏర్పడుతుందని అలాగే శారీరక దృఢత్వం ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లా యూ టి ఎఫ్ అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా ట్రెజరర్ చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శులు అక్రంబాష, రమణమూర్తి జిల్లా క్రీడా కన్వీనర్ సుధాకర్, మోడల్ స్కూల్స్ రాష్ట్ర కన్వీనర్ చంద్ర శేఖర్,క్రీడా కన్వీనర్ సుధాకర్ సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసరాజు, పీలేరు ప్రాంతీయ మండలాల యుటిఎఫ్ నాయకులు వెంకటరమణ, విజయకుమార్, రాజు, జోహార్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీనారమాను గంగమ్మ
## విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

**పనసమాకులపల్లెలో అమ్మవారి వేడుకలు**



సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన అమ్మవారి గుడి

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

మదనపల్లె రూరల్ మండలం, పొన్నేటిపాలెం గ్రామ పంచాయతీ పనసమాకుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీనారపమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు. శని, ఆదివారం రెండు రోజులు పాటు గంగమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు కనులపండగలా నిర్వహించారు. గంగమ్మ ఆలయాన్ని ఎంతో సుందరీకరణంగా నిర్మించారు. గ్రామస్థులు ఇచ్చిన విరాళాలతో పాటు పలువురు దాతలు ఈ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారు. రెండు రోజులు పాటు పనసమాకుపల్లెలో ఉత్సవ జాతర నెలకొంది. ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గంతో పాటు, సుదూర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో భక్తులు, దాతలు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు, స్నేహితులు హాజరయ్యారు. ఆదివారం ఉదయం అమ్మవారిక విగ్రహ ప్రాణప్రతిష్ట, మహా పూర్ణహుతి, కుంభాభిషేకం, అమ్మవారికి పంచామృత అభిషేకం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

# హెచ్ఎన్ఎస్ ద్వారా ఎర్రబల్లి చెరువుకి నీళ్లు ఇస్తాం



మీడియాకు వివరిస్తున్న బీటెక్ రవి

**పులివెందుల, ఆగస్ట్ 3, ప్రభాత వార్త:**

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి ఎర్రబల్లి చెరువుకు నీళ్ల వచ్చేలా చేసి శాశ్వత పరిష్కారం చేశామని ,ప్రజలు సమస్య తెలిపిన 24 గంటల్లోనే సమస్య పరిష్కార చర్యలు చేపట్టామని ఇద్దరు ముఖ్యమంత్రులు ఉండి కూడా సమస్యను పరిష్కరించలేక పోయారని నియోజక గురించి మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం తలుపుల మండలం దాంపల్లె వద్ద ఉన్న హెచ్ ఎన్ ఎస్ ఎస్ 420.2 కిలోమీటర్ నుంచి దాదాపు 15 కిలో మీటర్ల దూరంలో ఎర్రబల్లె చెరువు ఉందని అక్కడ నుంచి నీటిని విడుదల చేసేందుకు పుష్కలంగా ఉన్న అవకాశాలను అధికారులతో కలసి బిటెక్ రవి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎర్రబల్లి చెరువుకు కింద ఉన్న ఆయకట్టు కలిగిన గ్రామాల ప్రజలు ఇద్దరు సిఎంలుగా పని చేసిన కూడా యర్రబల్లె చెరువుకు నీళ్ల వదలలేక పోయారు అని చెరువుకి నీళ్ల ఇవ్వడానికి ఉన్న చిన్న అవకాశాన్ని కూడా గుర్తించలేక పోయారన్నారు. యర్రబల్లె, నలపురెడ్డిపల్లె, మోటున్నతల పల్లె గ్రామాల ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. ఎర్రబల్లె చెరువుకు నీటిని నింపడానికి ప్రస్తుతం ఉన్నటువంటి చిత్రావతి కుడి బ్రాంచ్ కెనాల్ నుంచి కేవలం ఎత్తిపోతల పథకం ద్వారా కావలసిన నీళ్లను ఇవ్వలేక పోతునందున దీనికి పరిష్కారం వైపు అధికారులతో చర్చించి సాధ్య సాధ్యలను పరిశీలించగా హెచ్ఎన్ఎస్ఎస్ నుండి జిఎన్ఎస్ ఎస్ నుంచి వయా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా మెయిన్ కెనాల్ 386 వద్ద పంప్ చేసి అక్కడ నుంచి 420.2 కిలో మీటర్ల వద్ద ఒక గేట్ వాల్ ఏర్పాటు చేసి నీటిని విడుదల చేయడానికి స్థానిక గ్రామాల ప్రజలను స్థానిక ఎమ్మెల్యే లను ఒప్పించడం జరిగింది అని దీని ద్వారా రోజుకు 30 కూసెక్కులు నీటిని ఎర్రబల్లె చెరువుకు తరలించవచ్చు అని ఇప్పటికే, మేము కడప జిల్లా పర్యటనకు సీఎం చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు విషయాన్ని నీటిపారుదల అధికారుల పర్యవేక్షణలో సిఎం సూచనల మేరకు, అన్ని అధికారులు కలిసి యర్రబల్లె చెరువుకు నీరును ఇవ్వడానికి అనుసంధానించడానికి ఏ ప్రదేశంలో గేట్ ను ఏర్పాటు చేయాలో నిర్ణయించారు. మేము రెండు నుండి మూడు రోజుల్లో ఈ గేటును ఏర్పాటు చేస్తాం అన్నారు. నీళ్ల లేనప్పుడు అనవసరంగా నిర్మాణాలు చేపట్టి డబ్బులు వృథం చేస్తున్నారు అని వైసీపీ నాయకులు విమర్శించడం అవివేకం అని అన్నారు. ఇపుడు నిర్మాణాలు పూర్తి చేసి సిద్ధంగా ఉంచితే నీళ్ల వచ్చినప్పుడు విడుదల చేయడానికి వీలు ఉంటుంది అన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు ఎప్పుడు నీళ్ల వచ్చిన కూడా యర్రబల్లె చెరువుకు నీళ్ల విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తద్వారా యర్రబల్లె పరిసర గ్రామాలు అయినటువంటి అన్ని గ్రామాలకు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి అని దానితో శాశ్వతంగా సాగు నీటి సమస్య, తాగునీటి సమస్య పరిష్కారం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు పుష్పనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌కు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ఎంపిక..




**వేంపల్లి: ఆగస్టు 03 (ప్రభాత వార్త):**

వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు క్రీడా రంగంలో తమ ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు. కడప మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ మీట్ బాస్కెట్ బాల్ సెలెక్షన్లలో పాల్గొన్న పాఠశాల విద్యార్థుల్లో 7 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే టెన్త్ ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్షిప్ ఫర్ బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా మారింది. ఈ పోటీలు పిఠాపురంలోని ఓ బి ఎస్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరగనున్నాయి.ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులు: వై.అరుణ్ కుమార్ రెడ్డి, ఎస్. భారత్ రాజ్ రెడ్డి, ఎస్. మనోజ్ కుమార్, వి.అన్వేష్ రెడ్డి, సి.యోగేంద్ర, జి. తేజ, పి. రామ్ చరణ్(స్టాండ్‌బై). వీరి శిక్షణకు మార్గనిర్దేశకులుగా నిలిచిన పాఠశాల పి ఈ టి కృష్ణ ప్రసాద్ శ్రమకు ఈ విజయం ప్రతిబింబిస్తుంది. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి అన్ని విధాలుగా సహకరిస్తూ ప్రోత్సహించిన పాఠశాల ఛైర్మన్ శ్రీ బి. చక్రపాణి రెడ్డి , డైరెక్టర్లు బి. చైతన్య రెడ్డి, బి.చేతన్ రెడ్డి తదితరుల సహకారం విలువైనదిగా నిలిచింది.పాఠశాల ఛైర్మన్ శ్రీ చక్రపాణి రెడ్డి మాట్లాడుతు, విద్యార్థులంతా రాష్ట్రస్థాయిలో మెరిసి పాఠశాల గౌరవాన్ని మరింతగా వెలుగులోకి తెచ్చేలా కోరుకుంటూ, వారందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు.

## పేకాట రాయుళ్లపై కొరఢా

**పెండ్లిమర్రి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

మండలంలోని కొండూరు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై మధుసూదన్‌రెడ్డి తన సిబ్బందితో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు ఆరు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9300 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. మట్కా, జూదం, పేకాట లాంటి అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడైనా జరిగితే సమాచారం ఇవ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పిటిసి ఆట కాదు...
# జూదగాల ఆట జరుగుతోంది

**పులివెందుల,ఆగస్టు 3, ప్రభాత వార్త:**

పులివెందులలో జెడ్పిటిసి ఎన్నికల్లో రాజకీయ ఆట జరగడంలేదని కేవలం జూదగాల్ల ఆట సాగుతోంది అని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసుపాటి కిషోర్ అన్నారు. పులివెందుల వైసీపీ జగన్ క్యాంపు కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసుపాటి కిషోర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నిక చిన్నది అయినా...ఇక్కడ ఎదో అద్భుతం జరగబోతుందని రాష్ట్ర స్థాయిలో టిడిపి తప్పుడు ప్రచారం చేస్తోందనీ అన్నారు. ఓటమి ఎరగని గొప్ప నేత వైయస్ రాజశేఖరరెడ్డి దేశానికి అందించిన గొప్ప నియోజకవర్గం పులివెందుల అని అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని ఎదిగిన నేతల నియోజకవర్గం అని ఇలాంటి నియోజకవర్గంలో జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లను గందరగోళంలోకి నెట్టాలని టిడిపి, బిజెపి నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. పులివెందుల టిడిపి ఇన్ చార్జి బిటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి లు ఈ ఎన్నికలను పేకాట అనుకుంటున్నారనీ అందుకే ప్రజాసమస్యలు, అభివృద్ధి పక్కన పెట్టారన్నారు.ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేయడమే తప్ప వీళ్లకు నిజమైన రాజకీయం తెలియదు అన్నారు. పులివెందులలో టీడీపీ గెలవదని అందరికీ తెలుసు అని పులివెందుల ప్రజలు ఆలోచించి ఓటు వెయ్యాల్సిన ఎన్నికలు ఇవి అని అభివృద్ధి కావాలో పేకాట రాయుళ్ల కావాలో తెలుసుకోవల్సిన ఎన్నికలు అని వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తి చేశారో బిటెక్ రవి చెప్పాలన్నారు. పులివెందులలో ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని గానీ అడిగే దమ్ము ధైర్యం బీటెక్ రవికి లేదన్నారు.అభివృద్ధి గురించి అడిగే దమ్ము లేని వాళ్ళు ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల ముందుకు వస్తున్నార న్నారు.పులివెందుల జడ్పిటిసి లో వైసీపీ అభ్యర్థి గెలుపు ఖాయం అన్నారు.ఈ నెల 12న జరగబోయే జెడ్పిటిసి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలవడం జరుగు తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, వైసీపీ వైద్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డా . పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షునిగా కొండపల్లి చిన్న సుబ్బారావు

**84 ఓట్లతో గెలుపు**

**బద్వేలు అర్బన్, ఆగస్టు 3 (ప్రభాతవార్త) :**



బద్వేలు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి, ఆర్యవైశ్య వర్తక సంఘం ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఆర్యవైశ్యులందరూ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు కేవి.సుబ్బారావు, కొండపల్లి చిన్న సుబ్బారావు ఇరువురికి హోరాహోరీగా ఓట్లు వచ్చినప్పటికీ కొండపల్లి చిన్న సుబ్బారావు 84 ఓట్లతో గెలుపొందారు. అనంతరం వాసవి కన్యకా పరమేవ్వరి అమ్మవారి సన్నిదిలో ఎన్నికల అధికారులు చింతకుంట చెన్నకృష్ణ, అయ్యపువెంకట రమణయ్య, కొలిశెట్టి శివప్రసాద్, తులసి సుబ్రమణ్యం, విశ్వనాథుల శ్రీరాములు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులుగా కొండపల్లి చిన్న సుబ్బారావుకు డిక్లరేషన్ ఫారం అందించారు. అనంతరం కొండపల్లి చిన్న సుబ్బారావు ఎన్నికకు సహకరించిన మాజీ మార్కెట్‌యార్డువైస్ ఛైర్మన్ కనమర్లపూటి ప్రసాద్, జూటూరు నాగరాజ, భూపాళం నాగరాజ, ఉరిమి శ్రీనివాసులు, మాలేపాటి వెంకటేశ్వర్లు తోపాటు పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ ఓట్లు వేసి తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి శాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

**పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు :**



ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం ఎన్నికల పోలింగ్ బూత్ వద్ద ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రాజగోపాల్ ఆదేశాల మేరకు ఎస్ఐ జయరామిరెడ్డి, సత్యనారాయణ తమ పోలీసు సిబ్బంది ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా చూశారు.



## ఏపీ ఎన్జీజివో ఎన్నికలు ఏకగ్రీవం..



**కడప కార్పొరేషన్ ఆగస్టు 03 ప్రభాతవార్త:**

ఆదివారం ఏపీ ఎన్జీజి వో కార్యాలయం నందు సిద్దవటం తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించినట్లు కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు వెల్లడించారు. ఎన్నికల అధికారి టీ తిమ్మరెడ్డి మాట్లాడుతూ సిద్దవటం యూనిట్ లో 12 మంది సభ్యులు మాత్రమే నామినేషన్ వేయడంతో ఎన్నికల అధికారి 12 స్థానాలకు ఒక్కొక్కరు రావడం తో పోటీ లేకుండా అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రెసిడెంట్ జె.సుబ్బారాయుడు, సహ అధ్యక్షలు వై. ప్రభాకర్ రెడ్డి లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా యానాదయ్య, పి.భాస్కర్ రెడ్డి, పి. శారదా, కె పవన్ కుమార్, కార్యదర్శి హైమావతి లు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా ఎస్.అంజనమ్మ, సల్మాన్ రాజు, లక్ష్మి నరసమ్మ, వెంకటరమణ, కోశాధికారి పి నాగేశ్వరరావు ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యవర్గము మూడేళ్ల కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి రవికుమార్ లు మాట్లాడుతూ పెండింగ్ డిఏలు, పిఆర్సి, సరెండర్ బిల్లులు, మెడికల్ డిపార్ట్మెంట్ ఎఫ్ టి ఏ బిల్లులు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షలు టి శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి నిత్య పూజయ్య సీటీ వైస్ ప్రెసిడెంట్ పద్మనాభం పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి**

**రాజంపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

కువైట్ , దుబాయ్, సౌదీలోని ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక మేడా భవన్లో రఘునాథ్ రెడ్డిని కువైట్ వై.యస్.కాంగ్రెస్ పార్టీ కమిటీకి చెందిన గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ ,బి.హెచ్. గల్ఫ్ అడ్వైజర్ నాయని మహేశ్వర్ రెడ్డి, కువైట్ కో కన్వీనర్ మన్నూర్ చంద్ర శేఖర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వి.పి రామచంద్రారెడ్డి, పులపుత్తూర్ సురేష్ రెడ్డి, రాజాసాబ్, గోపాల్ రెడ్డిలు కలిశారు. గల్ఫ్ లో వైసీపీ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. ముఖ్యంగా కువైట్ లో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పేరుతో మీరు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని ఎంపీ రఘునాథరెడ్డి అభినందించారు.గల్ఫ్ లో ఉన్న మన వారు ఇక్కడైనా, అక్కడైనా ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కువైట్, దుబాయి నుండి నేరుగా రేణిగుంట విమానాశ్రయానికి విమానాలు వచ్చేలా కృషి చేస్తున్నాని తెలిపారు.గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, గల్ఫ్ అడ్వైజర్ మహేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్ మన్నూర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వై.యస్.ఆర్, అన్నమయ్య జిల్లా నుండి సుమారు సుమారు 3 లక్షల మంది ఉన్నారని కువైట్, దుబాయి నుండి రేణిగుంట విమానాశ్రయానికి విమానాలు దిగేందుకు మీరు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. డిశంబర్ నెలలో కువైట్ కు రావాలని వారు ఎంపి రఘునాథరెడ్డిని ఆహ్వానించారు.



## బుగ్గ శివాలయం కోనేటిలో పూడిక తొలగింపు..

**కడప కార్పొరేషన్ ఆగస్టు 3 ప్రభాతవార్త:**



పూర్వం భృగుమహర్షి తపస్సు ఆచరించి ప్రతిష్టించిన శివలింగం ప్రదేశం.. శ్రీ బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయం కోనేటిలో పూడికను ఆదివారం ఉదయం సికె.దీన్నేమండలం, బుగ్గలపల్లె, నాగిరెడ్డిపల్లె, గూడావాండ్లపల్లె, బుగ్గ అగ్రహారం, కడప నగరం నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చి పూడికను తొలగించారు. గూడా ప్రభాకర్ రెడ్డి, గూడా సదానంద రెడ్డి, బొగ్గడి సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, మహిళలు, చిన్న పిల్లలు తీశారు.